క్లుప్తంగా

పెరటి కోళ్ల పంపిణీ


మద్దికెరలో కోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మద్దికెర: పొదుపు మహిళలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి.. 300 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కో యూనిట్‌లో 11 కోళ్లు ఉంటాయని, ధర రూ.3,250 ఉంటుందన్నారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, వైకేపీ ఏపీఎం మధుబాబు ఉన్నారు.

నిర్మాణాల్లో పురోగతి చూపండి


నిర్మాణాలపై సమీక్షిస్తున్న శ్రీనివాసకుమార్

వెల్దుర్తి: ఇళ్ల నిర్మాణాలు, నాడు–నేడు పనుల్లో పురోగతి చూపాలని ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసకుమార్ ఆదేశించారు. గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ–2 రమేష్, హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమై మండలంలో ఇళ్ల నిర్మాణాలు, నాడు–నేడు పనుల పురోగతిపై సమీక్షించారు. జగనన్న కాలనీల్లో, వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆక్రమణలు అడ్డుకుంటాం


ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా రూ.25 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టామని ఎంపీడీఓ నరసింహమూర్తి పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలాలను ఆయన పరిశీలించారు. గతంలో కొంత మంది రైతులు తమ అనుకూలంగా ఉండేందుకు స్థలాలను ఆక్రమించుకున్నారని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. రైతులతో చర్చించి వారు రాకపోకలు సాగించేందుకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఈఓ శ్రీహరి ఉన్నారు.

సకాలంలో బిల్లుల మంజూరు


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ శేషయ్య

మద్దికెర: నియోజకవర్గంలో చేపడుతున్న నిర్మాణాలకు బిల్లులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నట్లు పీఆర్ డీఈ శేషయ్య అన్నారు. ఆయన గురువారం మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ సెంటర్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారుల పర్యవేక్షణలో పనులు చేయాలని సూచించారు. లేకుంటే బిల్లులు నిలిపివేస్తామన్నారు. ఏఈ మోహన్‌నాయక్, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మోహన్ రెడ్డి

గోనెగండ్ల: గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎమ్మిగనూరు సీఐ మోహన్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని అలువాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలుంటే గ్రామ పెద్దల సమక్షంలో సమరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అల్లరిమూకలు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం గడపాలని గ్రామస్తులకు సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో రానున్న మొహర్రం పండుగను కులమతాలకు అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

అనుమతి లేని పాఠశాల సీజ్

ఎమ్మిగనూరుటౌన్: విద్యా శాఖ అనుమతి లేకుండా పట్టణంలో ప్రారంభించిన భాష్యం రెండవ బ్రాంచ్ పాఠశాలను గురువారం ఎంఈఓలు ఆంజనేయులు, మధుసుదన్‌రాజు సీజ్ చేశారు. గత నాలుగు రోజుల నుంచి అనుమతి లేని భాష్యం రెండవ బ్రాంచ్‌పై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు ఆందోళన చేసి డీఈఓ, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు విచారణ చేసిన అధికారులు పాఠశాలను మూసివేశారు.

'సురక్ష'తో సత్వరం ధ్రువపత్రాలు


హొళగుందలో సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

హొళగుంద: స్థానిక హొళగుంద–1 గ్రామ సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతం హామీలను నెరవేర్చి అన్ని వర్గాలకు మేలు చేకూర్చిందన్నారు. కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోందని వివరించారు. ప్రభుత్వ సేవలు ప్రజల ఇళ్ల వద్దకే అందాలనే ఉద్దేశంతో గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చిందని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందుతున్నాయా లేవా విచారిస్తున్నారన్నారు. ప్రజలకు ఏ ధ్రువీకరణ పత్రాలు అవసరమో తెలుసుకుని ఉచితంగా అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున, తహసీల్దారు హుసేన్ సాహెబ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ, హౌసింగ్ డీఈఈ ఆదినారాయణ, పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 19, 20వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు ప్రజలకు కావాల్సిన పలు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేశారు. వార్డు కౌన్సిలర్లు చంద్రమోహన్‌రెడ్డి, రామాంజినమ్మ, వార్డు ఇన్‌చార్జ్‌లు రుద్రాక్షాల బజారి, కెఎస్ శివన్న పాల్గొన్నారు.

మద్దికెర: అర్హులై ఉండి వివిధ కారణాలతో సంక్షేమ పథకాలకు దూరమైన వారికి లబ్ధి చేకూర్చేలా జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత అన్నారు. గురువారం


ఎమ్మిగనూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

స్థానిక సచివాలయం–2 లో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన 521 మందికి ఆదాయ, కుల, ఆర్ఓఆర్, రేషన్‌కార్డులు, అడంగల్ తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు.

వెల్దుర్తి: మండల పరిధిలోని రత్నపల్లె గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌రాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. బోయనపల్లె అశోక్‌రెడ్డి, రత్నపల్లె భాస్కర్ రెడ్డి, సుధాకర్ తదితరులు లబ్ధిదారులకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతు కార్డులు ఉచితంగా అందించారు.

తుగ్గలి: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా ప్రజలకు ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు అందించడానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని తీసుకొచ్చారని సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ పుష్పావతి అన్నారు. గురువారం శభాష్‌పురం, గిరిగెట్లలో తహసీల్దార్ రవి, ఎంపీడీఓ సావిత్రి ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డీటీ నిజాముద్దీన్, సర్పంచ్ రవి పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని నెరుడుప్పల, ఒంటెడుదిన్నె గ్రామాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను మంజూరు చేశారు.

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు, చిగిళి గ్రామాలలో గురువారం సర్పంచులు జయమ్మ, తోయజాక్షప్ప అధ్యక్షతన వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముత్తుకూరులో 314, కైరుప్పలలో 225 సర్టిఫికెట్లను తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ అందజేశారు.

> **సంతోషంగా ఉంది**
> గతంలో కౌలు కార్డు కావాలంటే వ్యవసాయ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకునే వారు కాదు. ఇప్పుడు మాత్రం నా ఆధార్ కార్డు, అడంగల్ తదితర వివరాలు తీసుకొని వెంటనే ఉచితంగా కౌలు రైతు కార్డు ఇచ్చారు. దీంతో వ్యయ ప్రయాసలు తప్పాయి. – చిన్నయ్య, మద్దికెర


మద్దికెరలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు


శభాష్‌పురంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

మంచిని ఓర్చుకోలేని దుర్మార్గులు చంద్రబాబు, పవన్

ప్రజల ఇళ్ల వద్దకే పాలన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని, వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఓర్చుకోలేక పోతున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆయన గురువారం హొళగుందలో సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ సైకోల్లాగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. వలంటీర్ల సేవలు అందుకున్న ప్రజలే వారికి సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

హాలిగేరకు వెళ్లి వృద్ధురాలికి పింఛన్

ఆస్పరి: ఈచిత్రంలో ఉన్న వృద్ధురాలు పేరు ఖాసీంబీ ఈమెది మండల కేంద్రమైన ఆస్పరి. వృద్ధాప్యం మీద పడడడంతో 11 నెలలు క్రితం మండలంలోని హాలిగేర గ్రామంలో ఉన్న కూతరు దగ్గరకు వెళ్లింది. ప్రతి నెల హాలిగేర నుంచి ఆస్పరికి వచ్చి పింఛన్ డబ్బులు తీసుకెళ్లేది. అయితే 6నెలలు క్రితం పత్తిని ఆరబోసేందుకు వెళ్లి జారిపడి కాలు విరిగింది. దీంతో నడవలేని స్థితిలో కూతురు దగ్గరే ఉండింది. విషయం తెలుసుకున్న వలంటీర్ గఫూర్ ఆస్పరికి 10 కిలో మీటర్లు దూరంలో ఉన్న హాలిగేరకు ప్రతి నెల వెళ్లి ఖాసీంబీకు పింఛన్ డబ్బులు అందజేశాడు.


హాలిగేరలో ఉన్న వృద్ధురాలు ఖాసీంబీతో వేలి ముద్ర వేయించుకుంటున్న వలంటీర గపూర్

కష్టకాలంలో పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడ్డాయి



కష్టకాలంలో ఉన్న తనకు పింఛన్ డబ్బులు ఎంతో ఉపయోగపడ్డాయి. కాలు విరిగినప్పటి నుంచి హాలిగేరలో కూతరు దగ్గరే ఉంటున్నాను. నేను ఆస్పరికి వెళ్లలేని పరిస్థితిని తెలుసుకుని వలంటీర్ గఫూర్ హాలిగేరకు వచ్చి పింఛన్ నగదు అందించాడు. వలంటీర్లు లేకుంటే మాలాంటి వారి పరిస్థితి బాగుండేది కాదు. మా వలంటీర్ గఫూర్ నాకు మరువలేని సహాయం చేశాడు.

– ఖాసీంబీ ఆస్పరి

ఆర్టీసీ ఉద్యోగుల ఆనందహేల

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందించే పెన్షన్ సొమ్మును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వారి జీవితాల్లో వెలుగులు నిండాయని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఉద్యోగులతో కలిసి ఆయన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో రిటైర్ అయిన ఉద్యోగికి నెలకు వెయ్యి, రెండు వేల రూపాయలు పింఛన్ వచ్చేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయంతో రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు పింఛన్ సొమ్ము వస్తుందని చెప్పారు. పెన్షన్ల పెంపుపై ఆర్టీసీ ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ జీవీ నాగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పంపయ్య, గ్యారేజీ ఏఎంఎఫ్ బాలాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి డిపో మేనేజర్ ఎస్ఎండీ రఫీక్ ఆధ్వర్యంలో కార్మికులు పాలాభిషేకం చేశారు. ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఇన్‌చార్జ్ కేవీఆర్ రెడ్డి, గ్యారేజ్ ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి, క్లర్క్ మోహన్‌రావు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ డీఎం, ఉద్యోగులు

ఓటరు సర్వే పక్కాగా చేపట్టాలి

ఎమ్మిగనూరురూరల్: ఓటర్ల ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించి అభ్యంతరాలు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీఎల్వోలకు సహకరించాలని కోరారు. బీఎల్వోలు అభ్యంతరాలను పట్టించుకోకపోతే ప్రతి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని, అలాగే ప్రతి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశాలు ఉంటాయని చెప్పారు. అక్టోబర్ 17న సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని, 17 నుంచి నవంబర్ 30 వరకు దరఖాస్తులు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిసెంబర్ 26 నాటికి దరఖాస్తులు, అభ్యంతరాలు పరిష్కరించి జనవరి 5 నాటికి తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామన్నారు. 2024 జనవరి 1 తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఒకే ఇంట్లో ఎక్కువ ఓటర్లు ఉన్నా, చనిపోయిన వారి పేర్లు ఉన్నా, డబుల్ ఎంట్రీలు ఉన్నా పరిశీలించి తొలగిస్తామని చెప్పారు. చేర్పులకు ఫారం–6, విదేశాలలోని భారతీయకుల కొరకు ఫారం–6ఏ, తొలగింపులకు ఫారం–7, సవరణకు ఫారం–8, ఓటును ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్చుకోవడానికి ఫారం–8ఏ పూరించి ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం తహసీల్దార్లు ఆంజనేయులు, వేణుగోపాల్ శర్మ, నిత్యానంద్, ఎన్నికల డీటీ గురురాజావు, వీఆర్వో షేక్షావలి, రాజకీయ పార్టీల నాయకులు బట్టారంగయ్య, శివ, మహబుబ్‌బాషా, కిరణ్‌కుమార్, నారాయణ, రంగన్న, విజేంద్ర, ఆనంద్, యర్రన్న, హకీం, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

పత్తికొండ రూరల్: ఓటర్ల జాబితాపై గురువారం ఆర్డీఓ కార్యాలయంలో మోహన్‌దాస్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హులను జాబితా నుంచి తొలగించేందుకు నెల రోజుల కార్యాచరణ కొనసాగుతుందన్నారు. ఓటర్ల వివరాలను బీఎల్ఓలు సర్వే చేస్తారని మార్పులు, చేర్పులు, తప్పొప్పులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఎన్నికల డీటీ శ్రీనివాసులు, ఆయా మండలాల తహసీల్దార్లు విష్ణుప్రసాద్, రవి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆలూరు అసెంబ్లీ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ మల్లికార్జున కోరారు. గురువారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్వో మాట్లాడుతూ.. ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితా సర్వే చేపట్టిన బీఎల్ఓలకు సహకరించేలా ఆయా రాజకీయ పార్టీల నుంచి ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్‌ను నియమించాలని కోరారు. బీఎల్ఓలు ఇంటింటికీ ప్రతిఒక్క ఓటరును సర్వే చేసి పక్కా జాబితా రూపొందిస్తారని చెప్పారు. అసిస్టెంట్ ఈఆర్వో రామాంజినేయులు, డీటీ విజయ్ కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బసవన్న గౌడ్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పత్తికొండలో మాట్లాడుతున్న ఆర్డీఓ మోహన్‌దాస్

నేటి నుంచి ఓటర్ల సర్వే

వెల్దుర్తి: ఈనెల 21 నుంచి ఆగస్టు 21వరకు బీఎల్ఓల ద్వారా పోలింగ్ బూత్‌ల వారీగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల సర్వే నిర్వహించనున్నట్లు డీటీ ప్రసాద్‌రాజు, ఆర్ఐ మస్తాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు (సచివాలయ ఉద్యోగులు) అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 58 పోలింగ్ బూత్‌లు ఉండగా బీఎల్ఓలు పకడ్బందీగా సర్వే చేపట్టి పారదర్శక ఓటరు జాబితా తయారు చేయాలని ఆదేశించారు.

నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలి


రైతులకు కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. ఆయన గురువారం బనవాసి ఫారంలో సెంట్రల్ నర్సరీని తనిఖీ చేశారు. నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనులతో పాటు పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నర్సరీలో అన్ని మొక్కలతో పాటు పశువులకు గడ్డి కూడా పెంచుతున్నట్లు చెప్పారు. ఆదోని డివిజన్‌లో 400 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం జరుగుతుందన్నారు. ఇంటి ఆవరణలో పెంచుకునేందుకు మొక్కలను ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఖాళీ స్థలాలలో పొలాల గట్లపై మొక్కలను నాటి పరిరక్షించాలన్నారు. బనవాసి సెంట్రల్ నర్సరీలో మునగ విత్తనాలు 30 వేలు, ఆలూరులో 20 వేలు, కాల్వబుగ్గలో 30 వేల విత్తనాలు నాటి పెంచుతున్నామని, జాబ్ కార్డు కలిగిన వారు ముందుకొస్తే ఉచితంగా మొక్కలను అందించడంతో పాటు వాటి పరిరక్షణకు నగదు అందిస్తామని చెప్పారు. కోటేకల్, దేవబెట్ట, మల్కాపురం గ్రామాల రైతులకు 1600 కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. పీడీతో పాటు ఎంపీడీఓ బంగారమ్మ, ఏపీఓ విజయ్‌మోహన్, నర్సరీ టీఓ భాస్కర్ తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలి

ఎమ్మిగనూరుటౌన్: కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, గోవిందు కోరారు. ఈ మేరకు ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్లను గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును బాగుచేయండి

హొళగుంద: అధ్వానంగ ఉన్న ధణాపురం–హొళగుంద రోడ్డును వెంటనే బాగుచేసి బస్సుల రాకపోకలు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని గురువారం సీపీఐ మండల సహాయ కార్యదర్శి పెద్యాట మారెప్ప, నాయకులు కోరారు. ఈ మేరకు హొళగుంద బస్టాండులో ధర్నా చేపట్టారు. రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి

ఆస్పరి: మండలంలోని గ్రామాలలో నిర్వహిస్తున్న నర్సరీలకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని ఉద్యాన శాఖ అధికారి ఇందిర నిర్వాహకులకు సూచించారు. గురువారం ఆస్పరిలోని నర్సరీలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు లైసెన్స్ ఉన్న వారి వద్ద మాత్రమే కూరగాయల మొక్కలను కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. లైసెన్స్ పొందిన వారు రిజిస్టర్లు నిర్వహించని పక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. నర్సరీ లైసెన్స్ తీసుకోవాల్సిన వారు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, 2 పాస్ ఫొటోలు, నీరు, మట్టి పరీక్షల రిపోర్టులు, బిల్లు బుక్కులు, నర్సరీ లేఔట్ తీసుకుని ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యాన శాఖ సహాయకులకు ఇవ్వాలన్నారు. ఆస్పరి ఉద్యాన శాఖ సహాయకులు కుమారి, జ్యోతిర్మయి పాల్గొన్నారు.

వీఆర్ఏలను ఆదుకోవాలి

గోనెగండ్ల: వీఆర్ఏలకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు రంగన్న, రామాంజినేయులు కోరారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం మండల వీఆర్ఏలు దీక్ష చేశారు. వారు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కేలు, రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. అలాగే డీఏ రికవరీ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, డీఏతో కూడిన వేతనం ఇవ్వాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వీఆర్ఏలుగా నియమించాలన్నారు. అలాగే సీనియరిటీ ఉన్న వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. వీఆర్ఏలు పెద్ద బజారి, హనుమంతు, రంగన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


అక్రమ కట్టడాన్ని తొలగించాలి

పత్తికొండ రూరల్: స్థానిక రెడ్డిబావి వీధిలోని పురాతన ఆంజనేయస్వామి దేవాలయంపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని వెంటనే తొలగించాలని భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ తాలుకా అధ్యక్షుడు వీరరాజు కోరారు. గురువారం ఆ ప్రాంతం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ మోహన్‌దాస్, ఈఓ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పురాతన ఆంజనేయస్వామి ఆలయంపై ఓ వ్యక్తి అక్రమంగా ఇంటిని నిర్మించడం దారుణమన్నారు. అక్రమ కట్టడానికి అనుమతి ఇచ్చిన వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భజరంగదళ్ నాయకులు కరణం నరేష్, భాస్కర్ రావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దేవనకొండ: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని ఎంపీపీ లక్ష్మిదేవి అన్నారు. ఈ మేరకు గురువారం దేవనకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మిదేవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాశాఖల అధికారులతో మండలంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ప్రజా సమస్యలను అధికారులు బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ గౌరీదేవి, తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్ల దేవుళ్లు


కొలువైన పీర్ల దేవుళ్లు

గోనెగండ్ల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం తెల్లవారు జామున పీర్ల దేవుళ్లు చావిడిలలో కొలువుదీరారు. మొహర్రం వేడుకలను మండల ప్రజలు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. 26న చిన్న సరిగెత్తు, 27న పగటి సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు, 29న మొహర్రం నిర్వహించనున్నట్లు ముజావర్లు తెలిపారు.

చెరువులకు నీళ్లు మళ్లించాలి

తుగ్గలి: హంద్రీ నీవా రిజర్వాయర్ ద్వారా చెరువులకు నీటిని మళ్లించాలని, టమాట జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తుగ్గలిలో జీపుజాత నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతలో ఆయన మాట్లాడుతూ వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతు సంఘం నాయకులు కొండారెడ్డి, శ్రీనివాసులు, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 1వ వార్డు సచివాలయ పరిధిలో బోయ రంగన్న గుండెపోటుతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మంజూరైన రూ.10 వేలను మృతుడి భార్య సుజాతకు గురువారం 16వ వార్డు కౌన్సిలర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ మిగతా సొమ్ము త్వరలోనే నామినీ బ్యాంకు ఖాతాలో జమఅవుతుందన్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఫాతిమా సాజిదా, వలంటీర్ ఖలీల్ పాల్గొన్నారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్ట్

తుగ్గలి: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పద్మావతి (36) హత్య కేసులో ఆమె భర్త గుంతకల్లు వెంకటేశ్వర్లు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. కూతురు పెళ్లి విషయమై తన మాట చెల్లుబాటు కాలేదని ఆగ్రహంతో వెంకటేశ్వర్లు ఈనెల 14న అర్ధరాత్రి నిద్రలో ఉన్న భార్యను గొడ్డలితో నరికి చంపాడు. ఘటనపై మృతురాలి తల్లి ములకలపెంట మంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు, మామ గోపాల్, మరిది గోవిందును అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు.

కన్నీటి వీడ్కోలు

తుగ్గలి: కిడ్నీ వ్యాధితో మరణించిన సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కన్నీటి వీడ్కోలు పలికారు. వెంకటేశ్వరరెడ్డి అంత్యక్రియలను గురువారం కుటుంబ సభ్యులు చెన్నంపల్లిలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జగన్నాథరెడ్డి, జిట్టా నాగేష్, మోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, నాగభూషణరెడ్డి, బసిరెడ్డిలు మృత దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వెంకటేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

పాఠశాలకు తాళం వేసి నిరసన

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో విద్యార్థులకు పాఠాలు బోధించే వారే కరువయ్యారని, ఉపాధ్యాయులను నియమించాలని కోరినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం నిట్రవట్టి గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో 252 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని, దీంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఐదుగురు ఉపాధ్యాయలను నియమించాలని కోరారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

ఆస్పరి: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో డీఎస్పీ ఆధ్వర్యంలో నాకా బందీ చేపట్టారు. అనుమానితుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామస్తులు ఐకమత్యంతో పండుగ జరుపుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలకు పంతాలు పట్టింపులకు పోకుండా సర్దుకుపోవాలన్నారు. గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్తికొండ, ఆలూరు సీఐలు మురళిమోహన్, రామక్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష మొక్కలు నాటేలా కార్యాచరణ


ఎన్‌హెచ్–167 డివైడర్‌లో మొక్కలను నాటే ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో లక్షకు పైగా మొక్కలను నాటి వాటిని పరిరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. పట్టణం మీదుగా వెళ్లే నేషనల్ హైవే 167 రోడ్ డివైడర్‌లో మున్సిపల్ సిబ్బంది మొక్కలు నాటడాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ వాసులు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

24న కంటి వైద్య శిబిరం

పత్తికొండ రూరల్: స్థానిక శ్రీషిరిడీ సాయిబాబా దేవాలయంలో ఈనెల 24న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పోగ్రాం కో–ఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మ దంపతుల సహకారంతో పేదలకు కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంటి సమస్యలతో బాధపడే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకు వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

డాక్యుమెంట్స్ మిస్సింగ్
శ్రీమతి కె.పార్వతమ్మ భర్త కె.ఈరన్న, ఎల్లార్తి గ్రామంకు చెందిన డాక్యుమెంట్ కర్నూలు జిల్లా ఆలూరు సబ్ రిజిష్టర్ ఎల్లార్తి గ్రామం సర్వే నెం. 255/ఏ1, డాక్యుమెంట్ నెం.1206/2002గా రిజిష్టర్ కాబడినది. 15.02.2023 నుంచి మా ఇంటిలో పడిపోయినవి. హొళగుంద పోలీసులకు కంప్లైంట్ ఇవ్వడమైనది. పోలీస్ సర్టిఫై నెం. MLD012300343856.